నమస్తే తెలంగాణ

సిద్దిపేట

I హైదరాబాద్, గురువారం 12 సెప్టెంబర్ 2024 SIDDIPET


## సొసైటీల్లో రికార్డుల పరిశీలన



మెదక్ జిల్లా రెడ్డిపల్లి సొసైటీలో రికార్డులను పరిశీలిస్తున్న అధికారి

చేగుంట, సెప్టెంబర్ 11: మెదక్ జిల్లా చేగుంట మండలంలోని సహకార సంఘాల్లో అక్రమాల పై 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి జిల్లా సహకార శాఖ అధికారులు స్పందించారు. బుధవారం చేగుంట మండలంలోని రెడ్డిపల్లి సహకార కార్యాలయంలో సీనియర్ ఇన్‌స్పెక్టర్ సంగమేశ్వర్, ఇబ్రహీంపూర్ సహకారం సంఘానికి సంబంధించి చేగుంట సహకార సంఘంలో ఆడిట్ అధికారి ఫయాజుద్దీన్ రికార్డులను పరిశీలించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇబ్రహీంపూర్, రెడ్డిపల్లి సహకార సంఘాల్లో రికార్డులను పరిశీలించామని, పూర్తి విచారణ అనంతరం నివేదికలు అందజేస్తామని తెలిపారు.

# రుణమాఫీపై స్పష్టత ఏది..!

## రెండు లక్షల పంట రుణమాఫీ కోసం ఉమ్మడి మెదక్ జిల్లాలో వేలాది మంది రైతుల ఎదురుచూపు

- బ్యాంకులు, వ్యవసాయ శాఖ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు
- రెండు లక్షల పైన రుణాలు ఉన్న రైతుల సంగతేంటి..
- బ్యాంకులో మిగతా డబ్బులు కట్టాలా...? వద్దా..?
- ఇప్పటికే వడ్డీలకు తెచ్చి కడుతున్న అన్నదాతలు
- రైతుల రుణమాఫీపై సమీక్షించని జిల్లా మంత్రులు
- రైతుల గురించి పట్టించుకునే వారేరీ..

సిద్దిపేట, సెప్టెంబర్ 11(నమస్తే తెలంగాణ ప్రతినిధి): రుణమాఫీ కాలేదని ఇటీవల దుబ్బాక నియోజకవర్గం చిట్టాపూర్‌కు చెందిన రైతు సోలిపేట సురేందర్ రెడ్డి ఆత్మహత్య చేసుకోవడం రైతులతో పాటు అందరినీ తీవ్రంగా కలిచివేసింది. ఉమ్మడి మెదక్ జిల్లావ్యాప్తంగా రుణమాఫీ కానీ రైతులు వేల సంఖ్యలో ఉన్నారు. రుణమాఫీ కాక రైతులు ఆవేదనతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరిస్తున్నది. రూ.2 లక్షల రుణమాఫీ చేసామని గొప్పలు చెప్పుకుంటున్నది. కానీ, క్షేత్రస్థాయిలో వాస్తవాలు వేరేలా ఉన్నాయి. సగం మందికి రుణమాఫీ కాక అన్నదాతలు గోసపడుతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. అధికారులు ఏమో మాకేం తెల్వదు.. మాకు ఇంకా గైడ్‌లైన్స్ రాలేదంటున్నారు. రెండు లక్షల పైన ఉన్నవి కడితే మాఫీ చేస్తమంటిరి కదా .! మరి బ్యాంకుకు వెళ్లి కట్టిరావన్న సార్ .. కట్టిరా.. మరి రుణమాఫీ రాకపోతే మీరు ఇస్తారా..? అని రైతులు అంటే సమాధానం చెప్పడం లేదు. ఏం చేయాలో పాలుపోని పరిస్థితి రైతులది. డబ్బులు కట్టాలా..? వద్దా...? కడితే బయట అప్పు తీసుకురావాలి..ఎప్పుడు రుణమాఫీ చేస్తారో తెలియదు. రైతుకు ముందుకు పోదామంటే నుయ్యి..వెనుక గొయ్యి అన్న చందంగా తయారైంది. కొన్ని గ్రామాల్లో బ్యాంకుకు వెళ్లి సార్ నావి రెండు లక్షల పైన ఎంత ఉన్నవి కట్టుకో అని బయట వడ్డీలకు తెచ్చి మరి బ్యాంకులో రైతులు కట్టి వస్తున్నారు. 15 రోజులుగా రైతులు బ్యాంకులు, వ్యవసాయ శాఖ అధికారులు చుట్టూ తిరుగతున్నారు.

> ఒక కుటుంబంలో భార్యాభర్తల పేర్ల మీద కలిపి రూ.2.65లక్షల రుణాలు ఉన్నాయి. వీరికి ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి ఉన్నది. ప్రభుత్వం రెండు లక్షల రూపాయలు రుణమాఫీ చేసింది అని చెబుతున్నది. కానీ, సైట్‌కు వెళ్లి చూడగా..'నిర్ధారణ చేయాల్సి ఉంది' అని వస్తున్నది. ఇలా వేలమంది రైతులు ప్రభుత్వం ఇచ్చే స్పష్టత కోసం ఎదురు చూస్తున్నారు.

> గత మార్చిలో తనకు ఉన్న పంట రుణాన్ని మొత్తం బ్యాంకులో కట్టి కుటుంబ అవసరాల కోసం ఒక రైతు ఆ భూమిని అమ్ముకున్నాడు. ప్రభుత్వం రుణమాఫీలో పెట్టిన కటాఫ్ ప్రకారం అతడికి రుణమాఫీ జాబితాలో పేరు వచ్చింది. తనకున్న రుణాన్ని మాఫీ చేసింది. మాఫీ డబ్బులు బ్యాంకు అధికారులు రైతుకు ఇవ్వాలి. కానీ, సంబంధిత బ్యాంకు అధికారులు ఆ మాఫీ డబ్బులు ఇవ్వమంటే ఇవ్వడం లేదని రైతు ఆరోపిస్తున్నాడు. ఇలాంటి వాటిపై ప్రభుత్వం బ్యాంకు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని బాధిత రైతులు డిమాండ్ చేస్తున్నారు.

### గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం

ఉమ్మడి మెదక్ జిల్లావ్యాప్తంగా మూడు విడతల్లో కాంగ్రెస్ ప్రభుత్వం వందశాతం పంట రుణమాఫీ చేసినట్లు గొప్పలు చెప్పుకుంటున్నది. కానీ, పూర్తిస్థాయిలో రైతులకు రుణమాఫీ కాక బ్యాంకులు, వ్యవసాయ శాఖ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. సాగు పనుల్లో నిమగ్నం కావాల్సిన రైతులంతా ప్రస్తుతం ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వస్తున్నది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాకుండా 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9 తేదీ వరకు బ్యాంకుల్లో రుణం తీసుకున్న రైతులకు మాత్రమే రుణమాఫీ కటాఫ్ పెట్టింది. అసలు వడ్డీ కలిపి రూ. 2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని ప్రకటించింది. ఈ మేరకు తొలి విడతలో జూలై 18న లక్ష రూపాయల వరకు, జూలై 30న లక్షన్నర లోపు, ఆగస్టు 15న రెండు లక్షల రుణాలను మాఫీ చేసినట్లు ప్రకటించింది. కానీ, రుణమాఫీలో ప్రభుత్వ నిబంధనలు, టెక్నికల్ సమస్యలతో పాటు రేషన్ కార్డు, రుణఖాతా మూసివేయడం తదితర సమస్యలతో చాలామంది రైతులకు రుణమాఫీ వర్తించలేదు. రూ. 2లక్షల పైన ఉన్న రైతుల రుణమాఫీ విషయంలో ఇంత వరకు ఒక స్పష్టత ఇవ్వక పోవడంతో రైతులు తమకు రుణమాఫీ అవుతుందా..? లేదా..? అని తమలో తాము కుమిలి పోతున్నారు. అదే రందితో ఇటీవల దుబ్బాక నియోజకవర్గంలోని చిట్టాపూర్‌కు చెందిన రైతు సురేందర్‌రెడ్డి ఆత్మహత్య చేసుకున్నాడు. పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో వ్యవసాయం పండుగలా సాగింది. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో రైతులకు అన్నీ కష్టాలే ఎదురవుతున్నాయి. రైతుభరోసా ఇవ్వడం లేదు. వందశాతం రుణమాఫీ చేయక తమను అరిగోస పెడుతున్నదని కాంగ్రెస్ సర్కారుపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఇటీవల రుణమాఫీ చేయాలంటూ గజ్వేల్ పట్టణంలో ర్యాలీ నిర్వహించిన బీఆర్ఎస్ నాయకులు, రైతులు

### రుణమాఫీ కోసం ఆందోళనలు

రుణమాఫీ చేయాలని రైతులు ఆందోళనలు, నిరసనలకు దిగుతున్నారు. కొన్ని చోట్ల బ్యాంకులకు తాళాలు వేస్తున్నారు. రుణమాఫీ కానీ రైతుల విషయంలో సర్వే చేస్తామని చెప్పి కొన్ని మార్గదర్శకాలను ప్రభుత్వం జారీ చేసింది. రుణమాఫీ కానీ అందరి రైతుల సర్వే చేయాలి. కానీ, అలా చేయడం లేదు. కేవలం రేషన్ కార్డు లేని వారి వివరాలు మాత్రమే సేకరిస్తున్నారు. రేషన్ కార్డు లేని వారి జాబితాను రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ అధికారులకు పంపింది. దాని ప్రకారమే తాము సర్వే చేస్తున్నామని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ఒక కుటుంబంలో రెండు లక్షల రుణమాఫీ కానీ వారి వివరాలను సేకరించడం లేదు. దీంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. తమ కుటుంబంలో ఎంత మందికి ఎంత రుణాలు ఉన్నాయి..? ఎంత మందికి రుణాలు మాఫీ చేయవచ్చు అనే వివరాలను సేకరించాల్సింది పోయి అదేం పట్టించుకోవడం లేదు. ఇంతకి రెండు లక్షల పైన రుణాలు ఉన్న కుటుంబాలకు రుణమాఫీ ఈ ప్రభుత్వం చేస్తుందా..? లేదా..? అనే సందేహాలు రైతులను వేధిస్తున్నాయి. రైతులు ఎక్కని మెట్లు లేవు..కలవని అధికారి లేరు. జిల్లాకు చెందిన మంత్రులు కనీసం సమీక్ష నిర్వహించడం లేదు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ, వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఇప్పటివరకు రుణమాఫీపై సమీక్షా సమావేశం నిర్వహించ లేదు. మంత్రుల తీరుపై రైతులు మండిపడుతున్నారు.

## గ్రామాల్లో 50శాతం రుణమాఫీ కాలేదు..

ఉమ్మడి మెదక్ జిల్లాలో రైతులకు రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం మొండిచెయ్యి చూపింది.రైతుల సంఖ్యకు రుణమాఫీ లెక్కలకు పొంతన లేకుండా పోయింది.లక్ష రూపాయల వరకు ఒకసారి, లక్షన్నర వరకు రెండోసారి, రెండు లక్షల వరకు మూడోసారి రుణమాఫీ చేసినట్లు ఆర్భాటంగా ప్రకటించింది. బీఆర్ఎస్ ప్రభుత్వం లక్ష రూపాయల వరకు రుణమాఫీ చేసింది. అప్పటి ఇప్పటి లెక్కలకు చూసుకుంటే రుణమాఫీ రైతుల సంఖ్యను కాంగ్రెస్ ప్రభుత్వం భారీగా తగ్గించింది. రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తే రైతుల సంఖ్య పెరగాలి గాని తగ్గింది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో లక్ష రూపాయల రుణమాఫీ చేసినప్పుడు ఉమ్మడి మెదక్ జిల్లాలో మొత్తం 4,17,591 మందికి రుణమాఫీ జరిగింది. 2014లో ఉమ్మడి జిల్లాలో 1,50,000 మంది రైతులకు రూ.398 కోట్లు బీఆర్ఎస్ ప్రభుత్వం మాఫీ చేసింది. 2018లో సిద్దిపేట జిల్లాలో 81,565 మందికి రూ. 418 కోట్లు, మెదక్ జిల్లాలో 73,026 మందికి రూ. 366.39 కోట్లు, సంగారెడ్డి జిల్లాలో 1,13,000 మందికి రూ. 678 కోట్లు మాఫీ చేసింది. ఇదంతా బీఆర్ఎస్ ప్రభుత్వంలో లక్ష రూపాయల లోపు రుణమాఫీ జరిగింది. మొత్తంగా 4,17,591 మందికి రూ. 1,860.39 కోట్లు రుణమాఫీ చేసి బీఆర్ఎస్ రైతు ప్రభుత్వం అని నిరూపించుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వం రెండు లక్షల వరకు రైతులకు రుణమాఫీ చేశామని చెప్పుకుంటున్నది. వీరు చేసింది ఎంతంటే 2,85,493 మంది రైతులకు రుణమాఫీ చేశారు. అంటే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష రూపాయల వరకు రుణమాఫీ చూసుకుంటేనే 1,32,098 మంది రైతులకు కోత పెట్టింది.రెండు లక్షల వరకు రుణమాఫీ అన్నప్పుడు రైతుల సంఖ్య పెరగాల్సి ఉండగా పూర్తిగా కోతలు పెట్టింది. దీంతో గ్రామాల్లో 50 శాతం మందికి రుణమాఫీ కాలేదు.



ఇటీవల మెదక్ జిల్లా నర్సాపూర్ సంపూర్ణ రుణమాఫీ చేయాలని ర్యాలీ చేస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, రైతులు




ఇటీవల హుస్నాబాద్‌లో రుణమాఫీ చేయాలంటూ ప్లకార్డులతో ధర్నా చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సతీశ్ కుమార్, రైతులు



సంగారెడ్డి జిల్లా గణేశ్‌పూర్ శివారులో అక్రమంగా ఎర్రరాయి తవ్వకాలు చేపడుతున్న అక్రమార్కులు

## నిమ్జ్ భూముల్లో అక్రమ తవ్వకాలు

- ఎర్రరాయి తవ్వకాలను పట్టించుకోని నిమ్జ్, మైనింగ్ అధికారులు
- కర్ణాటక, మహారాష్ట్రకు తరలించి సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి

న్యాల్‌కల్, సెప్టెంబర్ 11: సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలోని పలు గ్రామాల్లో జాతీయ ఉత్పాదక మండలి (నిమ్జ్) ప్రాజెక్టు కోసం సేకరించిన భూముల్లో ఎర్రరాయి అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. గణేశ్‌పూర్, న్యామతాబాద్, మల్కన్‌పాడ్, రేజింతల్, హద్నూర్ గ్రామ శివారుల్లో ఇష్టారాజ్యంగా ఎర్రరాయి తవ్వకాలు జరుగుతున్నా నిమ్జ్ ప్రాజెక్టు, మైనింగ్, రెవెన్యూ శాఖల అధికారులు చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. కొందరు అక్రమార్కులు ఎర్రరాయిని తవ్వి కర్ణాటక, మహారాష్ట్రకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమంగా సాగుతున్న ఈ దందాతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతున్నది. అంతేకాకుండా వ్యవసాయానికి అనుకూలంగా లేక రైతులు బీడుగా వదిలేసిన భూముల్లో సైతం అక్రమ తవ్వకాలు చేపడుతున్నారు. భూముల రైతులకు నామమాత్రంగా డబ్బులు చెల్లించి ఎర్రరాయిని తవ్వి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. జేసీబీ, హిటాచిలతో మట్టిని తొలిగించి ఎర్రరాయిని వెలికి తీసి ట్రాక్టర్లు, లారీల్లో తరలిస్తున్నారు. నిర్మాణ రంగంలో ఎర్రరాయికి మంచి గిరాకీ ఉండడంతో అక్రమార్కులు బాగా సంపాదిస్తున్నారు. ప్రభుత్వ, పట్టా భూముల్లో ఎర్రరాయి తవ్వకాలు జరపాలంటే తహసీల్ కార్యాలయం నుంచి ఎన్‌వోసీ తీసుకుని మైనింగ్ శాఖ ద్వారా అనుమతి పొందాల్సి ఉంటుంది. అందుకు తగిన ఫీజు చెల్లించిన తర్వాతే అనుమతితో ఎర్రరాయి తవ్వకాలు జరపాలి. కానీ, ఈ నిబంధనలు ఎక్కడా అమలు కావడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఎర్రరాయి అక్రమ తవ్వకాలపై మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేస్తే ఈ విషయాన్ని రెవెన్యూ అధికారులు చూస్తారని, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తే మైనింగ్ అధికారులు చూస్తారని చేతులు దులిపేసుకుంటున్నారు. దీంతో అక్రమ వ్యాపారానికి అడ్డుపడడం లేదు. ఈ విషయాన్ని న్యాల్‌కల్ తహసీల్దార్ భూపాల్ దృష్టికి నమస్తే తెలంగాణ తీసుకెళ్లగా.. ఎర్రరాయి తవ్వకాల వ్యవహారం మైనింగ్ శాఖ అధికారులే చూసుకుంటారని పేర్కొన్నారు. ఎర్రరాయి అక్రమ తవ్వకాలపై జహీరాబాద్ నిమ్జ్ ప్రాజెక్టు డిప్యూటీ కలెక్టర్ నాగలక్ష్మి దృష్టికి తీసుకెళ్లగా.. పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు.



సంగారెడ్డి జిల్లా గణేశ్‌పూర్ శివారులో జేసీబీ తో మట్టిని తొలిగిస్తున్న దృశ్యం

## రైతులకు న్యాయం చేసేందుకే వక్ఫ్ బిల్లు

### జహీరాబాద్‌లో జేపీసీ సభ్యురాలు, ఎంపీ డీకే అరుణ




సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో రైతులతో మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

కోహీర్, సెప్టెంబర్ 11: తెలంగాణలో 80వేల ఎకరాల రైతులభూములు వక్ఫ్ బోర్డు పేరున నమోదు అయ్యాయని మహబూబ్‌నగర్ ఎంపీ, వక్ఫ్ సవరణ చట్టం జేపీసీ సభ్యురాలు డీకే అరుణ అన్నారు. రైతు హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో బుధవారం జహీరాబాద్‌లోని ఎన్ కన్వన్షన్ హాలులో ఏర్పాటు చేసిన వక్ఫ్ భూ బాధిత రైతులతో ఆమె ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కులమతాలకతీతంగా రైతులకు న్యాయం చేసేందుకే కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ సవరణ చట్టం బిల్లును ప్రవేశ పెట్టిందన్నారు. వక్ఫ్ బోర్డులో భూమి రికార్డు అయిన రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. భూములు విక్రయించడం, కొనడం చేయలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. పెండ్లి కోసం భూమిని అమ్మాలన్నా అవకాశం లేదన్నారు. పట్టాదారు పాసు పుస్తకాలు లేక రూ.2లక్షల రుణమాఫీ, రైతుబంధు రాలేదని గుర్తు చేశారు.ఈ బిల్లు విషయంలో కేంద్ర ప్రభుత్వంపై కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. మసీదులు, శ్మశాన వాటిక స్థలాలను ఎవరూ తీసుకెళ్లరని చెప్పారు. రైతులు వ్యవసాయం చేస్తున్న భూముల వివరాలు మాత్రమే సేకరించి కమిటీకి అందజేస్తామని వెల్లడించారు. జహీరాబాద్ డివిజన్‌లోని 12,892 ఎకరాల భూమికి వక్ఫ్ బోర్డు నుంచి విముక్తి కల్పించాలని రైతులు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, రైతు సాధన సమితి కన్వీనర్ వెంకటేశ్వర్‌రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ జైపాల్ రెడ్డి, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ రామకృష్ణారెడ్డి, వీరారెడ్డి, రామచందర్, భాస్కర్‌రెడ్డి, మనోహర్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.





సిద్దిపేట ఎర్రచెరువు కట్టపై మైసమ్మ ఆలయం వద్ద తొలిగించిన గ్రిల్స్

## అపహరణకు గురవుతున్న గ్రిల్స్

సిద్దిపేట కమాన్, సెప్టెంబర్ 11: సిద్దిపేట జిల్లా కేంద్రానికి ఆనుకొని ఉన్న ఎర్రచెరువు కట్టకు ఇరువైపులా ఏర్పాటు చేసిన గ్రిల్స్ అక్కడక్కడ ధ్వంసం కావడంతోపాటు అపహరణకు గురవుతున్నాయి. పట్టణ ప్రజలకు ఆహ్లాదం పంచేలా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎర్రచెరువును తీర్చిదిద్దారు. కట్టపై నుంచి వెళ్లే వారికి రక్షణగా ఉండేలా ఇరువైపులా గ్రిల్స్ ఏర్పాటు చేశారు. కట్టపై మైసమ్మ ఆలయం వద్ద ఒక సైడు పూర్తిగా గ్రిల్స్ లేకుండాపోయాయి. మరికొన్ని చోట్ల పక్కకు ఒరిగాయి. సైడ్ గ్రిల్స్ అపహరణ, ధ్వంసం కాకుండా అధికారులు రక్షణ చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.





సిద్దిపేటలో విఘ్నేశ్వరుడికి పూజలు చేస్తున్న హరీశ్‌రావు

ఎమ్మెల్యే హరీశ్‌రావును సన్మానిస్తున్న నిర్వాహకులు

## ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు
- సిద్దిపేటలో పలు వినాయకుల దర్శనం

సిద్దిపేట,సెప్టెంబర్ 11: వినాయకుడి చల్లని చూపుతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే హరీశ్‌రావు కోరారు. సిద్దిపేట పట్టణంలోని హౌసింగ్‌బోర్డు, స్నేహమిత్ర యూత్, వాసవి యూత్, పార్వతీమాత యూత్ అసోసియేషన్ల వినాయకులను బుధవారం రాత్రి ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వినాయకుని ఆశీస్సులు మన అందరిపై ఉండాలన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.



సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం ధర్మారంలో మక్క చేనులో కంకులు కోస్తున్న గ్రామస్తులు (ఇన్‌సెట్‌లో) బాధిత రైతు మల్లారెడ్డి

## కోతులతో విసిగి.. పంట వదిలేసి

మద్దూరు(ధూళిమిట్ట), సెప్టెంబర్ 11: మక్క పంటను కోతులు పాడుచేస్తుండడంతో మనస్తాపానికి గురైన రైతు పంటను వదిలివేసి బాధతో ఇంటికి తిరుగుముఖం పట్టిన సంఘటన బుధవారం సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం ధర్మారంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మంకెన మల్లారెడ్డి తనకున్న రెండెకరాల్లో మక్క పంట సాగు చేశాడు. కాలం అనుకూలించడంతో మక్క పంట ఏపుగా పెరిగింది. పంట చేతికందే దశలో కోతులు పంటను తీవ్రంగా నష్టపర్చాయి. కోతుల బెడద నుంచి పంటను కాపాడుకునేందుకు నానా ప్రయత్నాలు చేసి నా పంట చేతికొచ్చే పరిస్థితులు లేకపోవడం తో రైతు మల్లారెడ్డి మక్క పంటను వదిలివేశాడు. దీంతో పలువురు గ్రామస్తులు ఆ పంట చేనులో అరకొరగా మిగిలిన మక్క కంకులను కోసుకొని వెళ్లారు. గతంలో ఇలాంటి పరిస్థితులు ఎప్పుడూ ఎదురుకాలేదని, కోతులు పంటలను తీవ్రంగా నష్టపరుస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కోతుల బెడద నివారణకు చర్యలు తీసుకోవడంతో పాటు దెబ్బతిన్న పంటలకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు.

## తుమ్మ గాలయ్య మృతికి హరీశ్‌రావు సంతాపం



గాలయ్య (ఫైల్)

సిద్దిపేట, సెప్టెంబర్ 11: సిద్దిపేట చేనేత కురు వృద్ధుడు తుమ్మ గాలయ్య మృతికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతి బాధాకరమని, గొల్లభామ చీరలను అత్యధికంగా తయారు చేసి మాస్టర్ వీవర్‌గా పేరు తెచ్చుకున్నట్లు తెలిపారు. కనుమరుగైన పట్టు పీతాంబారాలను ఈ ఆధునిక ప్రపంచానికి పరిచయం చేశారని, అనేక మందికి చేనేత వృత్తిని నేర్పించారని పేర్కొన్నారు. దేశంలో ఎక్కడ చేనేత ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసినా అందేలో గాలయ్య స్టాల్ ఉండేదన్నారు. గొల్లభామ, టై అండ్ మస్సరైజ్డ్, పటోళ్ల చీరలు, పోచంపల్లి చీరలు తయారు చేయడంలో ఎంతో నైపుణ్యాం కనబర్చారని, ఆయన మృతి చేనేత రంగానికి తీరని లోటని హరీశ్‌రావు పేర్కొన్నారు. వారి కుటుంబా నికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## దెబ్బతిన్న టమాట పంట

వర్గల్, సెప్టెంబర్ 11: భారీ వర్షాలకు కూరగాయల పంటలు దెబ్బతినడంతో రైతులకు నష్టాలే మిగిలాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మొక్కజొన్న, వేరుశనగ, పెసర, లోబాన్, బీర, కాకర, టమాట పంటలు బాగా దెబ్బతిన్నాయి. సిద్దిపేట జిల్లా వర్గల్ మండలంలోని గౌరారం, మజీద్‌పల్లి, తున్కిఖల్సా, వేలూర్, వర్గల్ క్లస్టర్లలో పెద్దమొత్తంలో రైతులు టమాట సాగు చేశారు. మండలంలో టమాట 369 ఎకరాల్లో పండించారు. భారీ వర్షాలకు టమాట రైతులు ఇప్పుడు లబోదిబోమంటున్నారు. బహిరంగ మార్కెట్‌లో 25 కిలలో టమాట ట్రే రూ.700 వరకు పలుకుతున్నది. వర్షాలకు భారీగా పంట దెబ్బతినడంతో తాము మంచి ధరను కోల్పోయి నష్టపోయామని టమాట రైతులు బాధపడుతున్నారు.

### అప్పులే మిగిలాయి..



రెండున్నర ఎకరాల్లో ఎకరం టమాట సాగుచేసిన. మిగతా భూమిలో మొక్కజొన్న, వరి పంటలు వేసిన. ఈ వానకాలం సాగుకు రూ.1.50 లక్షల అప్పు తెచ్చి పంటలు వేసిన. టమాట చేను మంచి కాపుమీద ఉన్నది.మార్కెట్‌లో ధర సైతం ఒక్కో ట్రెబాక్స్‌కు (25 కిలోలు) రూ.700 ధర పలుకుతున్నది. టమాటతో అప్పులు తీరుతాయి అనుకున్నా. భారీ వానలు నా టమాట చేనును ముంచాయి. ఎవుసం కోసం చేసిన అప్పులు తీరే మార్గంలేదు ప్రభుత్వమే నన్ను ఆదుకోవాలి.

– కుమ్మరి భాస్కర్, రైతు, అంబార్‌పేట



భారీ వర్షాలకు దెబ్బతిన్న టమాట పంట



సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణ బైపాస్‌లో ప్రమాదకరంగా రహదారి



సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం నాగారం రహదారిలో కోతకు గురైన బీటీరోడ్డు

## రోడ్లు ఇలా... ప్రయాణం ఎలా?

హుస్నాబాద్‌టౌన్, సెప్టెంబర్ 11: భారీ వర్షాల కారణంగా సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని పలు రహదారులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వరద ఉధృతి కారణంగా రోడ్లు ధ్వంసం కావడమే కాకుండా కోతకు గురయ్యాయి. దీంతో ఆ రహదారుల వెంట వాహనదారులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సి వస్తుంది. రోడ్డు పూర్తిస్థాయిలో కోతకు గురికావడం, ధ్వంసమైనప్పటికీ సంబంధిత ఆర్అండ్‌బీ అధికారులు తాత్కాలిక మరమ్మతులు సైతం చేపట్టలేదు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారులతోపాటు పలు వార్డుల్లో సైతం వరద కారణంగా రోడ్లు దెబ్బతిన్నప్పటికీ మరమ్మతుల విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహించవద్దని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. తక్షణమే మరమ్మతులు చేపట్టి ఇబ్బందులు తొలిగించాలని కోరుతున్నారు.